కథా నిలయం
2058
శ్రీకాకుళం

# హృదయంలేని మనుషులు

రామం బెదురుతూనే ఆ యింటి గేటుదాటి లోపలికి నాలుగడుగులు వేశాడు. గుమ్మందాకా పోయి ఎవరన్నా కనబడతారేమోనని చూస్తూ నిలబడిపోయాడు.

ఈ నెలలో యిక్కడికి రావటం యిది అయిదోసారి. అయిదుసార్లుకాదు, పదిసార్లన్నా రాకతప్పదు; తన అవసరం తీరేదాకా.

గుమ్మంలోంచి తొంగి చూశాడు. ఎవరూ కనబడ లేదు. లోపలనుంచి ఎవరో రోగిష్టిమనిషి దగ్గుతున్నట్లు మాత్రం వినిపించింది. రామం ఎవర్నయినా పిలుద్దామని అనుకొని ఒక నిమిషం చూద్దామని ఆగిపోయాడు.

లోపలనుంచి అడుగుల చప్పుడు అయేసరికి చూస్తూ నిలబడిపోయాడు. రంగయ్యగారబ్బాయి కృష్ణమూర్తి వస్తున్నాడు లోపలనుంచి. రామాన్ని చూడగానే మొహం చిట్లించుకుని "ఏమీరా? ఇలా వచ్చారేం?" అని అడిగాడు.

ఆ ప్రశ్న వినగానే రామానికి చిర్రెత్తుకు వచ్చింది. తను వచ్చిన పనేమిటో తెలిసికూడా అలా అడుగుతాడేం? కనీసం తనను కూర్చోమని అంటాడని అనుకున్నాడు. ఏమీ లేకపోగా ఏమీ తెలియనట్లు తననే ఎదురు ప్రశ్నిస్తున్నాడు. అయినా తన కోపాన్ని చంపుకుని "మొన్న వస్తే యివాళ రమ్మనమని చెప్పారు" అన్నాడు వినయంగానే.

కృష్ణమూర్తి ముఖంలో విసుగు, కోపం స్ఫుటంగా కనుపించాయి. "అవునండీ. మొన్నటి సందర్భాన్ని బట్టి అలా చెప్పాను. ఎంతయినా పరిస్థితులు ఆలోచించ నక్కర్లా? ఇంట్లో ఆయన ఒకమూల చావు బతుకుల్లో వుంటే యిలా వచ్చి పీడించటం సబబేనా?" అన్నాడు.

"అదికాదు..." అంటూ రామం ఏదో చెప్ప బోయాడు.

"మా కున్నప్పుడు మేము ఎంత దర్జాగా బ్రతికామో తెలుసా? మీలాంటి వాళ్ళకే వందమందికి అప్పిచ్చేవాళ్ళం. ఈ రోజు కాలం మారి మీవంటి వాళ్ళచేత అనిపించుకోవ ల్సిన ఖర్మం పట్టింది. అంతమాత్రంచేత మా పరువూ మర్యాదా ఆలోచించకుండా ఏవేళ బడితే ఆవేళ వచ్చి అలా అడగేసెయ్యటమేనా రామారావుగారూ!"

రామం నిలద్రొక్కుకున్నాడు. "నిజమేనండీ. కానీ మీ ఒక్కళ్ళవే కాదు చిదికిన బ్రతుకులు. మా బ్రతుకులూ అలా తెల్లవారినవే. ఇవాళ్టిరోజున మా యింట్లో బియ్యం

లేవు. నాకు రెండో చొక్కా లేదు. చిట్టిదానికి జ్వరంవచ్చి నానా బాధపడిపోతుంటే మందు పోయించటానికి చేతిలో ఎర్రని ఏగానీ లేదు. ఇవన్నీ మాకు బాధలు కావంటారా? బాధలంటే మీ ఒక్కళ్ళవే ననుకున్నారా?" అన్నాడు ఆవేశంగా.

కృష్ణమూర్తి అందుకు సమాధానంగా ఏదో చెప్ప బోయాడు. అంతలో లోపలికి వస్తున్న డాక్టరుగారు "ఏమి టోయి కృష్ణమూర్తీ?" అని అడిగాడు.

"సమయానికి వచ్చారు డాక్టరుగారూ! ఇది సబబేనా చెప్పండి. మా వంశం ఎట్లాంటిదో మీకు తెలుసుకదా. నాన్నగారెప్పుడో యీయన తండ్రివద్ద అయిదొందలు అప్పుచేశారుట. అది అడగటానికి యీయనకు సమయం యిదే దొర్కింది అవతల ఆయన చావు బతుకుల్లో అల్లాడి పోతుంటే యిలా వచ్చి పీడించటం హృదయంవున్న మనిషి చేయవలసిన పనేనా అండి?" అన్నాడు కృష్ణమూర్తి.

డాక్టరుగారికి ప్రమేయంలేని యీ ప్రసంగం ఆయ నతో చెప్పట మెందుకా అని తెల్లబోయాడు రాముం.

డాక్టరు అర్థంచేసుకున్నట్లు ఒక చిరునవ్వు నవ్వాడు. తరువాత తీక్షగా యిద్దరి ముఖాలవంకా చూస్తూ "ఈ అప్పుల వాళ్ళున్నారే మూర్తీ, వీళ్ళవంటి పాషాణాలు యింకెవరూ వుండబోరు అవతలవాళ్ళు ఎలా చస్తున్నా వీళ్ళ కనవసరం. వాళ్ళ డబ్బు వాళ్ళకు రావాలి. ఎదుటివాడి ఏడ్పులు వాళ్ళ

మనసుల్ని కరిగించవు. ఒక్కమాటలో చెప్పాలంటే వాళ్ళ కన్నా పశువులు నయం" అన్నాడు.

కృష్ణమూర్తి అందుకున్నాడు: "బాగా చెప్పారు డాక్టరుగారూ మీకిప్పుడు దమ్మిడీ ఫీజు యిస్తుండక పోయినా వెనుకటి స్నేహాన్నిబట్టి వచ్చి ట్రీట్ చేస్తున్నారా లేదా? ఈ స్థితిలో యీ అప్పులవాళ్ళ టలు నాన్నగారి చెవిన బడితే ఆయన ఎంత యిదయిపోతారు?" అనేశాడు.

రామానికి వాళ్ళ మాటలు వింటుంటే ఆవేశం పెల్లుబికింది. అతి కష్టంమీద ఆపుకుని "దయవుంచి ఆ మాటలు మానేసి ఎప్పుడిస్తారో చెప్తే చాలా సంతోషం" అన్నాడు కఠినత్వం తెచ్చుకుని.

"ఇస్తాం ఎప్పుడో అప్పుడు ఒక పదిరోజులాగి రండి" అని కృష్ణమూర్తి లోపలికి వెళ్ళిపోయాడు. అతని వెనుక డాక్టరుకూడా లోపలికి వెళ్ళుతున్నాడు. వెనక్కి తిరిగిపోబోతున్న రామానికి చటుక్కున ఒక ఆలోచన తట్టింది. "ఆగండి డాక్టరుగారూ" అని కేకేశాడు. డాక్టరు ఆగిపోయాడు తెల్లబోయి. రామం ఆయనకు బాగా దగ్గిరికి పోయాడు.

"ఇందాకా అన్ని ధర్మపన్నాలు చెప్పారే. మేము హృదయంలేని వాళ్ళమని అన్నారే. మీరు రంగయ్యగారికి ఉచితంగా ట్రీట్‌మెంట్ యిస్తారుగా. మీరంతా హృదయం గల వాళ్ళుగా. రండి; మాకూడా అలానే వైద్యం

చెయ్యండి. మా చిట్టి జ్వరంవచ్చి మందులేక అల్లాడిపోతు న్నది. దాన్ని బ్రతికించండి వచ్చి" అన్నాడు గట్టిగా అరుస్తూ.

డాక్టరు చిరునవ్వు నవ్వాడు. "ఎవరిపట్ల ఎలా ప్రవ ర్తించాలో మాకు తెలుసు. అనవసరంగా ఆవేశం మాత్రం పడబోకు" అంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

రామం వెనక్కి తిరిగాడు నిస్పృహతో.

తన తండ్రి బ్రతికివున్నప్పుడు అంటే- యించుమించు మూడేళ్ళక్రితం రామయ్యగారికి అయిదువందలు అప్పు యిచ్చాడు. రంగయ్యగారు అప్పటికే చితికిపోయారు. అయినా అతనికీ తనకూ ఉన్న స్నేహాన్నిబట్టి యిచ్చాడు తన తండ్రి. ఆ తరువాత ఒక ఏడాదికే చనిపోయాడు తన తండ్రి. ఆయనతోపాటు ఉన్న కాస్తాకూడా హరించిపోయింది.

తనకిప్పుడు డెభ్భయి రూపాయల వుద్యోగం తప్పితే మిగిలింది లేదు. తను యీ యింటిచుట్టూ ఎన్నిసార్లు తిరి గినా కాళ్ళకు శ్రమ తప్పితే ఫలితంమాత్రం ఏం లభించ లేదు. కాగా పోగా ఒక చెడ్డపేరు మాత్రం దక్కింది— హృదయంలేని వాడని.

అప్పులవాళ్ళను గురించి లోకాని కంతటికీ తెలిసిన విషయం ఒక్కటే— వాళ్ళు హృదయం లేనివాళ్ళని. వాళ్లు తమ డబ్బును యిమ్మని అడగటంలో క్రూరత్వం ఏముందో అనే ప్రశ్న ఎవరికీ పట్టని విషయం.

ఇంకో వారంరోజులు పోతే లిమిటేషన్ అయిపో తుంది. తనింక ఆ డబ్బుమీద ఆశ వదులుకోవలసిందే. వ్యాజ్యం వేస్తాడా? ఖర్చు లెక్కడినుంచి వస్తాయి?

ఇంటికి చేరాడు. చిట్టి మంచంమీద పడుకునివుంది. ప్రక్కన కూర్చుని రుక్మిణి విసురుతున్నది. లోపలికిపోయి విసురుగా కూర్చున్నాడు రామం.

"ఏమయింది?" అనడిగింది రుక్మిణి

రామం యీ ప్రశ్న వినిపించుకోలేదు. "ఎలావుంది?" అని అడిగాడు.

"ఇందాకటిలాగే."

రామం మాట్లాడలేదు. తనను తను ప్రశ్నించు కున్నాడు. "నే నెందుకు పనికివస్తాను?" అని.

"లేవండి"

"ఎందుకు?"

"భోజనం చెయ్యరూ?"

"ఉహూ"

"ఏం?"

"ఆకలి లేదు."

రుక్మిణి అంతకన్న మాట్లాడలేదు. ఉడుకులాంలో ముంచిన గుడ్డ తీసి చిట్టి నుదురుమీద వేసింది

ఒకోరోజు గడిచినకొద్దీ చిట్టికి జ్వరంఎక్కువవుతూ వచ్చింది. రామానికి కంగారు ఎక్కువయింది.

"ఎవరన్నా డాక్టరు దగ్గరకుపోయి పిల్చుకురండి" అంది రుక్మిణి ఒకరోజు.

"డబ్బు?"

రుక్మిణి తెల్లబోయింది.

"ఏం అమ్ముతావు యింక? అమ్మేందుకు ఏము న్నాయి? నీ మెళ్ళో మంగళసూత్రం పసుపుకొమ్ముగామారి ఎన్నాళ్ళయింది?"

రుక్మిణి ఏడ్చింది గొల్లుమని. "దాని ప్రాణం ఏమయి పోతోందోనని విచారింలేదా మీకు? డబ్బు తరువాత చూసు కుందాం. ముందు ఎవరన్నా డాక్టర్ని తీసుకురండి మనకు అది ఒక్కటేబిడ్డ. అదిలా నాశనం అయిపోతుం టే చూస్తూ వూరుకుంటారా?" అన్నది గట్టిగా ఏడుస్తూ.

రామం అంగలార్చాడు. "దాని ప్రాణానికి నాప్రాణం అడ్డువేయాలని వుంది. ఏం చెయ్యను? ఏది మార్గం? ఏ విధంగా దాని ప్రాణం కాపాడతాను?" అన్నాడు.

అన్నాడేగాని ఆ సాయంత్రం ఒక డాక్టర్ని తీసుకు వచ్చి చూపించాడు. పరీక్షించినతర్వాత "ఇన్నాళ్ళూ ఏం చేస్తున్నారు?" అని అడిగాడు ఆయన.

"అంటే?"

"ఇది చాలా సీరియస్ కేసు. టైఫాయిడ్."

రామం గుండె దడదడ లాడింది. "ఎలా? ఎలా నయం కావడం?"

"ఇన్ జక్షన్లు చేయించటానికి డబ్బు వున్నదా?"

రామం తెల్లబోయాడు.

డాక్టరు అక్కడ యింకా ఉండవలసిన అగత్యం లేదు.

వెళ్ళిపోయాడు. రుక్మిణి గొల్లున ఏడ్చింది. "నా చిట్టితల్లిని బ్రతికించండి. మీకు దణ్ణం పెడతాను" అంటూ రామం కాళ్ళమీద పడిపోయి ఏడ్చింది.

రామానికి కళ్ళు చెమ్మగిల్లాయి. మాట్లాడలేకవూరు న్నాడు.

"వెళ్ళండి. ఆ రంగయ్యగారినే అడగండి. ఎలాగయినా తీసుకురండి" అన్నది రుక్మిణి ఏడుస్తూ.

"ఎలా పోయేది అక్కడికి? నాకు హృదయంలేదట. నేను మనిషిని కాదు వాళ్ళ దృష్టిలో. పోయి ఏం చేసేది?"

"ఏమన్నా? చిట్టితల్లి కోసం ఏదయినా చెయ్యండి" అంది రుక్మిణి యింకా ఏడుస్తూ.

రామం ఆలోచనలో మునిగిపోయాడు. ఆ రోజు దాటిపోతే రంగయ్యగారు తన బాకీ యింక యివ్వనవసరం లేదు. లిమిటేషన్ పూర్తవుతుంది. అయినా ఏ మొహం పెట్టుకుని అడగటం? తనను వాళ్ళేమయినా ఒక మనిషికింద జమ చేస్తారా?

కాని చిట్టి? అది చచ్చిపోతుంది. వెళ్ళక చేసేదేముంది? తనకు హృదయం లేకపోయినా సరే, నలుగురూ ఏమనుకున్నా సరే పోయి తీరాలి.

రామం బయల్దేరాడు. కాళ్ళ శక్తికొద్దీ నడిచి రంగయ్యగారి యింటికి చేరాడు.

ఆ యింటికి కొంచం దూరంనుంచే ఉలికిపడ్డాడు. అదేమిటి? జనం అక్కడ ఎందుకు గుంపుగా మూగి వున్నారు?

రామం బాగా దగ్గరికిపోయాడు. అతనికి ఎవరివో ఏడుపులు వినిపించాయి. గుంపును తోసుకుని లోపలికి పోయాడు. రంగయ్యగారి శవం. శవంమీద పడి ఎవరెవరో ఏడుస్తున్నారు. రామం నిశ్చేష్టుడయిపోయాడు. రంగయ్య చచ్చిపోయాడా?

కృష్ణమూర్తివంక చూశాడు. అతను నిప్పులు కక్కుతూన్న కళ్ళతో రామం వంక చూశాడు. ఆ చూపులో ఎంతో భావం వుంది. "ఓరి హృదయంలేని పశువా?"

అక్కడ ఒక క్షణం వుండలేకపోయా డతను. గిరుక్కున వెనక్కి తిరిగాడు. నాలుగయిదు అడుగులు వేశాడు. ఎవరో ఆడామె అంటున్నది అతన్ని చూసి:

"ఇదేనా నాయనా నీకు సమయం? ఒకమూల ఆ మహానుభావుడు చచ్చిపోయి వాళ్ళు ఏడుస్తూంటే అప్పు అడగటానికి వచ్చావా? హృదయం వున్న మనిషేనా నువ్వు?"

రామం ఆ మాటలన్న ఆవిడ మొహంకూడా చూడలేదు. చరచర అడుగులు వేస్తూ యింటికి వచ్చేశాడు.

దారిలో అంతా అతనికి ఒకే మాటలు వినిపించాయి; "ఓరి పశువా? నీకు హృదయం లేదూ?"

ఇంటికి చేరింతరువాత హృదయం బ్రద్దలయే కొత్త మాటలు వినిపించాయి.

రుక్మిణి ఏడుస్తూంది. "అయ్యో తల్లీ, చిట్టీ, ఒకసారి... ఒకసారి కళ్ళువిప్పి చూడవూ?"